# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ రోజు నుంచి మూడు రోజుల పాటు రష్యా, ఆస్ట్రియా దేశాలలో పర్యటిస్తారు.
2. ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్వేత పత్రాన్నివిడుదల చేస్తారు.
3. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానం ఈ రోజు ప్రారంభమవుతోంది.
4. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి.
5. ప్రపంచ మహా సముద్రాల దినోత్సవాన్ని ఈ రోజు జరుపుకుంటున్నాం.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు నుంచి మూడు రోజుల పాటు రష్యా, ఆస్ట్రియా దేశాలలో పర్యటిస్తారు. అంతర్జాతీయ పర్యటనలో భాగంగా ఈ రోజు రష్యాకు బయలుదేరి వెళ్లనున్నారు. భారత్ రష్యా 22వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనాలని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానించడంతో నరేంద్ర మోదీ ముందుగా ఈరోజు మాస్కోలో పర్యటిస్తారు. అక్కడ రష్యా అధ్యక్షులు పుతిన్‌తో జరిగే సమావేశంలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించడంతో పాటు సమకాలీన ప్రపంచ సమస్యలపై చర్చించనున్నారు. రష్యా పర్యటన ముగిసిన తరువాత ప్రధానమంత్రి రేపు ఆస్ట్రియా చేరుకుంటారు. 41 ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఆస్ట్రియా దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి. మాస్కోతో పాటు వియన్నాలోని ప్రవాస భారతీయులతో నరేంద్ర మోదీ సమావేశమవుతారు.

-------------------------

ఢిల్లీ, హైదరాబాద్ పర్యటనలను ముగించుకొని ప్రత్యేక విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత రాత్రి చేరుకున్నారు. ముఖ్యమంత్రికి మంత్రి కొల్లు రవీంద్ర, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రహదారి మార్గాన ఉండవల్లిలోని నివాసానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు శ్వేత పత్రాన్ని విడుదల చేయనుంది. రాష్ట్రంలో ఇంధన శాఖ, విద్యుత్తు రంగ ప్రస్తుత పరిస్థితి, ఇంధన రంగ భవిష్యత్తు కార్యాచరణపై ప్రభుత్వం తీసుకునే చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించనున్నారు.

-------------------------

కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా ఈరోజు గన్నవరంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం విజయవాడ నుంచి రహదారి మార్గం ద్వారా రాజమహేంద్రవరం చేరుకుంటారు. అక్కడ జరిగే స్థానిక కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. కేంద్రమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

---------------------------

ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో మార్పుకు దోహదపడతాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రను ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి హారతిలిచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో ఏర్పాటైన ప్రభుత్వం ప్రజలందరిదని తెలిపారు. సర్వమతాలకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని మతాలకు చెందిన వారికి తగిన మతపర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానం ఈ రోజు ప్రారంభమవుతోంది. ఈక్రమంలో ఇసుక తవ్వకాలు, రవాణా ఖర్చులు వంటి రుసుములను డిజిటల్ విధానంలో స్వీకరించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి నగదు లావాదేవీలు లేకుండా డిజిటల్ చెల్లింపులు ద్వారా పారదర్శక విధానం అమలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పార్వతీపురం మన్యం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, అనంతపురం మినహా, మిగతా 20 జిల్లాల్లో ఇసుక నిల్వ కేంద్రాల వద్ద ఈ రోజు నుంచి ఈ ఉచిత ఇసుక విధానం తొలుత అమలు కానుంది.

---------------------------

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ -టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. తుది కీతో పాటు ఫలితాలను టీజీపీఎస్సీ ఒకేసారి విడుదల చేసింది.గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించారని టీజీపీఎస్సీ తెలిపింది. జూన్ 17లోపు అభ్యంతరాలు తెలపాలని సూచించింది. తెలంగాణలో జూన్ 9న గ్రూప్ 1 పోస్టులకు నిర్వహించిన పరీక్షల ఫలితాలను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు. అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా తెలంగాణలో గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బోదవాడలోని సిమెంట్ కర్మాగారంలో నిన్న ప్రమాదం సంభవించింది. కర్మాగారంలోని బాయిలర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనలో విధుల్లో ఉన్న కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయని వారికి జగ్గయ్యపేట, విజయవాడ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని పోలీసు అధికారులు తెలిపారు. కాగా ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అండగా నిలవాలని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. హీటర్ లోపంతో పేలుడు

జరిగినట్లు ప్రాథమికంగా తెలిసిందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వి.సుభాష్ తెలిపారు. పేలుడు ఘటనపై నివేదిక ఇవ్వాలని మంత్రి సుభాష్ అధికారులను ఆదేశించారు.

---------------------------

మానవాళికి సముద్రాల ఆవశ్యకత తెలియజెప్పేందుకు ఏటా జూలై 8వ తేదీన ప్రపంచ మహా సముద్రాల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. "మహా సముద్రాలలో కొత్త లోతులను మేల్కొలపండి" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ మహా సముద్రాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం.. కనీసం 50 శాతం ఆక్సిజన్ సముద్రం నుంచి ఉత్పత్తి అవుతుంది. భూమిపై విడుదలయ్యే 30 శాతం కార్బన్ డయాక్సైడ్ను సముద్రాలు గ్రహిస్తాయి. ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ వల్ల కలిగే దుష్ ప్రభావాలను తగ్గిస్తాయి. సముద్రం మన ఆర్థిక వ్యవస్థకు కీలకం, 2030 నాటికి 40 మిలియన్ల మంది ప్రజలు సముద్ర ఆధారిత పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతారని అంచనా. ఈ రోజు సముద్రాల ఆవశ్యకత తెలియజేస్తూ అనేక దేశాల్లో పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాలకు మేలు చేకూర్చే జాతీయ రహదారులు, జలవనరులు, రైల్వేలైన్ల విస్తరణకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. హైదరాబాద్‌లో నిన్న చంద్రబాబు నాయుడుతో మంత్రి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో చర్చించామని, జల వివాదాలు పరిష్కరించుకొని ప్రగతిపథంలో సాగేందుకు కృషి చేయాలని చంద్రబాబు నాయుడు సూచించారని మంత్రి పేర్కొన్నారు. సత్తుపల్లి నుంచి కోవూరు రైల్వేలైన్, పెనుబల్లి నుంచి కొండపల్లి రైల్వేలైన్ పనులు పూర్తయితే ఇరు రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనకరమని ఆంధ్రప్రదేశ్‌లో ఈ లైన్‌పై దృష్టి సారించాలని కోరినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

దేశంలో ఆరోగ్యరంగాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న నిర్వహించిన 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ సదస్సు ముగింపు సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, దేశ ఎగుమతుల్లో 5 శాతం కన్నా ఎక్కువ వాటా ఔషధ ఫార్మా రంగానిదేని తెలిపారు. ఫార్మా విశ్వవిద్యాలయాన్ని హైదరాబాద్‌లోనే ఏర్పాటుచేసేలా కృషి చేస్తానన్నారు. భారతీయ ఫార్మా రంగం అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునేలా ఫార్మాస్యూటికల్ సాంకేతిక పథకం దోహదపడుతుందని తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నూతన నేర, న్యాయ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత , భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం ఈ నెల 1వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. ప్రతి ఒక్కరికీ సమర్ధవంతమైన న్యాయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ఈ చట్టాలను కేంద్రం రూపొందించింది. దేశ న్యాయ వ్యవస్థను మరింత పరిపుష్టం చేయడంతో పాటు భారత దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతకు ఈ మూడు చట్టాలు దోహదపడ తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నూతన నేరచట్టాల ఆవశ్యకత గురించి తెలియజేస్తూ ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం

రూపొందించిన నూతన నేర చట్టాలపై ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ మార్కుల జాబితాలో దివ్యాంగ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక జీవో విడుదల చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో దివ్యాంగుల కోటాలో 170వ ర్యాంకు సాధించిన విజయవాడకు చెందిన మారుతీ పృథ్వీ సత్యదేవ్‌కు.. ఇంటర్ సర్టిఫికెట్ విషయంలో ఎదురైన సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి సంబంధిత విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

--------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ఈరోజు. వైఎస్ఆర్ జిల్లా, జమ్మలమడుగులో 1949 జూలై 8న వై.యస్.రాజశేఖర్ రెడ్డి జన్మించారు.వైద్య విద్యను అభ్యసించిన ఆయన పూర్తి రూపాయికే వైద్య సేవలందించి.. రూపాయి డాక్టర్‌గా పేరుపొందారు. అనంతరం రాజకీయరంగ ప్రవేశం చేసి పులివెందుల శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మొత్తం 6 సార్లు శాసన సభ్యులుగా, కడప లోక్‌సభ నుంచి నాలుగు సార్లు పార్లమెంట్ సభ్యులుగా గెలుపొందారు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2009లో రెండోపర్యాయం ముఖ్యమంత్రి అయ్యారు. రెండోసారి ముఖ్యమంత్రిగా సెప్టెంబర్ 2న చిత్తూరు జిల్లాలో రచ్చబండ కార్యక్రమానికి వెళ్తూ నల్లమల అడవుల్లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు.

=====================